‘వికసిత్ భారత్ వికసిత్ రైల్వే’ పోటీల్లో నాలుగు రాష్ట్రాల విద్యార్థులు

26న విజేతలకు ప్రధాని చేతుల మీదుగా బహుమతుల ప్రదానం

హైదరాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో గురువారం ‘2047-వికసిత్ భారత్ వికసిత్ రైల్వే’ అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన, పెయింటింగ్, వక్తృత్వ పోటీల్లో 37,351 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న భారతీయ రైల్వేలపై అవగాహన పెంచాలనే లక్ష్యంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలలోని 269 పాఠశాలల్లో పోటీలు నిర్వహించారు. ప్రధానంగా హైదరాబాద్ డివిజన్ పరిధిలోని 60 పాఠశాలల్లో జరిగిన పోటీల్లో 7,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సికింద్రాబాద్ డివిజన్‌లోని 42 పాఠశాలల్లో నిర్వహించిన పోటీల్లో 5326 మంది విద్యార్థులు పాల్గొనగా 126 మంది వివిధ విభాగాల్లో విజేతలుగా ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ డివిజన్‌లో 55 పాఠశాలల్లో జరిగిన పోటీల్లో 11,235 మంది, గుంటూరు డివిజన్‌లోని 25 పాఠశాలల్లో జరిగిన పోటీల్లో 3010 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. గుంతకల్ డివిజన్ పరిధి ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల్లోని 39 పాఠశాలల్లో జరిగిన పోటీల్లో 6780 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మహారాష్ట్ర నాందేడ్ డివిజన్ పరిధిలోని 48 పాఠశాలల్లో జరిగిన పోటీల్లో 3,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిల్లో గెలుపొందిన విద్యార్థులకు ఫిబ్రవరి 26న ప్రధాని నరేంద్రమోదీ బహుమతులు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేస్తారని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలియజేశారు.

‘రాజద్రోహం కేసును తొలగించాలి’



మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నేతలు

రాంనగర్, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): 40 సంవత్సరాలుగా ప్రజాఉద్యమాల్లో, పోరాటాల్లో ఆందోళనల్లో బహిరంగంగా నిత్యం తిరిగే న్యూ డెమొక్రసీ నేతలపై కాంగ్రెస్ పాలనలో పెట్టిన రాజద్రోహం కేసును వెంటనే తొలగించాలని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాదినేని వెంకటేశ్వర్‌రావు, రాష్ట్ర నాయులు కె.గోవర్ధన్, గౌనిబలయ్య, జి.అనురాధలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈనెల 14న ఇల్లెందు పొలిమేరలో పోలీసులు చేసిన అరెస్టులు ఇతర అంశాలకు సంబంధించి వారు మంత్రికి వివరించారు.

నేడు భక్తులకు అన్నప్రసాద వితరణ

రాంనగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కామాఖ్యామృత శోధన సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో రాజశ్యామల అమ్మవారి ద్వితీయ వార్షికోత్సవం నిర్వహిస్తున్నామని ఆ సంస్థ ప్రతినిదులు కాసనగొట్టు రాజశేఖర్‌గుప్తా, వాడకట్టు రాజుగుప్తా, అమ్రాజునాగారాజు, అనంతుల ఆంజనేయులు నేతి సత్యనారాయణ తెలిపారు. వాసవీ సేవా సమితి రాంనగర్ శాఖ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం గాంధీనగర్, ఆర్యవైశ్య సంఘం చిక్కడపల్లి వాసవీ సేవా కేంద్రం, హైదరాబాద్ వాసవీ క్లబ్‌ల సౌజన్యంతో మధ్యాహ్నం 1 గంటకు అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతుందని వారు పేర్కొన్నారు. గురువారం రాంనగర్‌లో జరిగిన కార్యక్రమంలో అన్నదాన ప్రసాద వితరణ బ్రోచర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలకు ఉచిత ప్రవేశం ఉందన్నారు.

ఓటర్ జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలి

రాంనగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులందరూ తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు ఆర్.మెజేస్ సూచించారు. గురువారం రాంనగర్ డివిజన్‌లోని దయారామార్కెట్ చౌరస్తాలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ముఠాగోపాల్ సూచన మేరకు రాంనగర్ డివిజన్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆమోదయోగ్యమైన వారినే దేవాలయ పాలకవర్గ సభ్యులుగా నియమించాలి : కృష్ణంరాజు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీ దేవాలయాల పాలక వర్గ సభ్యులుగా అందరికీ ఆమోదయోగ్యమైన వారినే నియమించాలని హిందూ ఏక్తా ఆందోళన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు డిమాండ్ చేశారు. గురువారం బషీర్‌బాగ్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కృష్ణంరాజు మాట్లాడుతూ, స్థానిక కాంగ్రెస్ నేతల సిఫార్సులను పక్కన పెట్టి దేవాదాయ శాఖ మంత్రి, నగర ఇన్‌చార్జి మంత్రి వివిధ ప్యానళ్ల నుంచి ఆర్జీలను తీసుకొని అర్హత ఉన్న వారినే పాలకవర్గ సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గం పరిధిలోని శ్రీవేంకటేశ్వర స్వామి, శ్రీలక్ష్య మణేశ్వరస్వామి దేవాలయాల పాలక వర్గ సభ్యుల సిఫార్సుల్లో అనేక అక్రమాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.

మోదీ చొరవతోనే రామమందిర నిర్మాణం : బీజేపీ


బర్కత్‌పుర, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ చొరవతోనే అయోధ్యలో రామమందిర నిర్మా ణం జరిగిందని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ గౌతమ్‌రావు అన్నారు. ఐదు శతాబ్దాల నిరీక్షణ అనంతరం భవ్యమైన రామమందిర నిర్మాణం పూర్తయి ప్రారంభమైందని ఆయన అన్నారు. గురువారం అంబర్‌పేట నియోజకవర్గం నుంచి ట్రైన్‌లో అయోధ్యకు వెళుతున్న రామభక్తులకు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు ఎ.సూర్యప్రకాష్‌సింగ్, అజయ్‌గౌడ్, శ్యాంరాజ్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

రాంనగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మాతృభాషను మాట్లాడే ప్రజలు ఉన్నంత కాలం అది మృతభాష కాదని పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ పేర్కొన్నారు. డాక్టర్ లయన్ విజయ్‌కుమార్ తెలుగు భాషా సాహిత్యాలకు చేస్తున్న కృషి అనితర సాధ్యమన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలో భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రముఖ కవి బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో కవి సమ్మేళనం, ప్రముఖ కవి శ్రీనివాస్‌గౌడ్ కథల సంపుటి మార్జినోళ్లు పుస్తక పరిచయ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ ఇనాక్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, ప్రముఖ కవులు జెల్లి విద్యాధర్, విడి రాజగోపాల్, కళావేదిక జాతీయ ఉపాధ్యక్షుడు గుత్తా హరి తదితరులు పాల్గొన్నారు.

25న మాలమహానాడు రాష్ట్రస్థాయి సమావేశం

కవాడిగూడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర కమిటీ విస్తృతస్థాయి సమావేశాన్ని ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు వీఎల్ రాజు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దాని తరువాత పరిణామాలు భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం కోసం ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, హిమాయత్‌నగర్‌లోని స్ట్రీట్ నెంబర్ 11లోని కేవీరెడ్డి ఆర్కేడ్‌లోని నాలుగో అంతస్తులో ఈ సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు.



బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాల క్లినికల్ న్యూట్రిషియన్ విభాగం ఆధ్వర్యంలో గురువారం సైన్స్ విద్యార్థులకు యూనియన్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా న్యూట్రివిండ్ హెల్త్‌కేర్ వ్యవస్థాపకులు, సీఈవో విశాల్ మావూరి, అంబేద్కర్ కళాశాల న్యూట్రిషన్ విభాగం అధ్యక్షుడు బి.అనూష అవగాహన కల్పించారు. (రాంనగర్, ఆంధ్రజ్యోతి)

నీటి బిల్లుల జారీలో గందరగోళం

● నెలల తరబడి జాప్యం ● ఫోన్ యాప్ తెచ్చినా ఫలితం శూన్యం



మీటర్ రీడింగ్‌ను అప్‌లోడ్ చేస్తున్న రీడర్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వాటర్‌బోర్డు జారీ చేస్తున్న నీటి బిల్లులు గందరగోళంగా మారాయి. మీటర్ రీడర్లతో బిల్లులు జారీ చేస్తే సమస్యలు తలెత్తుతున్నాయని భావించి ఫోన్ యాప్ తీసుకొచ్చినా ఫలితం ఉండడం లేదు. మీటర్‌రీడర్ నల్లామీటర్ ఫొటో తీసి వాటర్‌బోర్డు ఫోన్ యాప్‌లో అప్‌లోడ్ చేసినా బిల్లులు సక్రమంగా రావడం లేదు. నెలల తరబడి ఆలస్యం చేయడంతో పాటు ఇష్టానుసారంగా బిల్లులు వేస్తున్నారు. అడ్డగోలుగా వస్తున్న బిల్లులను ఏ విధంగా చెల్లించాలని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు.

గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలోని పలుప్రాంతాల్లో వాటర్‌బోర్డు నీటిసరఫరాతో పాటు బిల్లులు వసూలు చేస్తోంది. జీహెచ్‌ఎంసీ పరిధిలోని గృహ కనెక్షన్లకు నెలకు 20 వేల లీటర్ల వరకు తాగునీటిని ఉచితంగా అందిస్తున్నారు. అంతకు మించి నీటిని వినియోగిస్తే బిల్లులు జారీ చేస్తున్నారు. ఇందుకోసం నీటి మీటర్లే ప్రామాణికంగా మారాయి. మెకానికల్ నీటి మీటర్‌తో సమస్యలు వస్తున్నాయని వాటి స్థానంలో ఆటోమేటిక్ మీటర్ రీడింగ్ (ఏఎంఆర్) మీటర్లను తీసుకొచ్చారు. గతంలో మీటర్‌రీడర్లు ఇంటింటికీ వెళ్లి వీటిలో వచ్చే రీడింగ్‌ను ఈ-పాస్ మిషన్లలో నమోదు చేసి బిల్లు ఇచ్చేవారు. మీటర్ రీడర్లు తక్కువ రీడింగ్ నమోదు చేసి అవకతవకలకు పాల్పడుతున్నారని భావించి మొబైల్ యాప్ తీసుకొచ్చారు. మీటర్ రీడర్ ఇంటింటికీ తిరిగి ఏఎంఆర్ మీటర్‌రీడింగ్‌ను ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. డీజీఎం స్థాయి అధికారులు డివిజన్ల వారీగా మీటర్‌రీడింగ్‌ను పరిశీలించి బిల్లు వేస్తారు. ఆ బిల్లును ఆన్‌లైన్‌లోనే పొందాల్సి ఉంటుంది. లేకుంటే మీటర్‌రీడర్ మరోసారి రీడింగ్‌కు వచ్చినపుడు ఇస్తారు.

మీటర్‌రీడర్ ఫొటో తీసి పంపినా బిల్లు రావట్లేదు

కమర్షియల్, గృహకనెక్షన్ల మీటర్‌రీడింగ్‌లను రీడర్లు ఫొటో తీసి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్‌చేస్తున్నా అధికారులు వెంటనే పరిశీలించడం లేదు. రెండు, మూడు నెలల బిల్లులను ఒకేసారి ఇస్తున్నారు. చెల్లించకుంటే జరిమానా విధిస్తామని హెచ్చరిస్తున్నారు. మీటర్‌రీడింగ్ కంటే అధికంగా బిల్లులు వేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఎల్‌బీనగర్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి, జీడిమెట్ల ప్రాంతాల్లో ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయి. గతంలో తమకు ప్రతినెలా బిల్లు వచ్చేదని, ప్రస్తుతం రెండు, మూడు నెలలకోసారి ఇస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

అన్ని బస్తీల్లో శాశ్వత ప్రాతిపదికన సీసీరోడ్ల నిర్మాణం : ఎమ్మెల్యే



సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలోని అన్ని బస్తీల్లో డ్రైనేజీ మంచినీటి పైప్‌లైన్‌ల నిర్మాణ పనులు పూర్తయిన తరువాత శాశ్వత ప్రాతిపదికన సీసీరోడ్లను నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. గురువారం కాచిగూడ డివిజన్ నింబోలి పున్నిపాల్స్ హైస్కూల్ సమీపంలో రూ.27లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ కన్నె ఉమాదేవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రోడ్ల వెంట నిరుపయోగంగా ఉన్న మట్టికుప్పలను వెంటనే తొలగించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. నిర్మాణ పనులు ఆలస్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె ముష్‌యాదవ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎర్రబిష్మదేవ్, సీనియర్ నాయకులు డాక్టర్ బద్దుల ఓం ప్రకాష్‌యాదవ్, ధాత్రిక్‌నాగేందర్ బాబ్జీ, బబ్లూ, అశోక్ పాల్గొన్నారు.

‘పది’ విద్యార్థులకు అల్పాహారం పంపిణీ

రాజపేట చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఆంజనేయులు



ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న ట్రస్ట్‌చైర్మన్ ఆర్.ఆంజనేయులు

ముషీరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు ప్రతిరోజూ సాయంత్రం నిర్వహించే స్పెషల్ క్లాసుల్లో వారు అలసి పోకుండా ఉండేందుకు రాజపేట చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఆర్.ఆంజనేయులు మాట్లాడుతూ, విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు చదువుకుంటూ అలసిపోకుండా ఉండేందుకే మార్చి 17 వరకు రోజూ సాయంత్రం అల్పాహారం పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిదులు శ్రీనివాస్ పటాలే, కమల్‌కుమార్ శర్మ, రమణారావు, ప్రధానోపాధ్యాయురాలు స్వరూపారాణి, ఉపాధ్యయులు నరేందర్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ ఆధ్వర్యంలో పర్సనాలిటికేర్ డైరెక్టర్ డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ అవగాహన తరగతులు నిర్వహించినట్లు తెలిపారు.

1న నియోజకవర్గంలో విజయ సంకల్పయాత్ర: బీజేపీ



ముషీరాబాద్ పార్టీ కార్యాలయంలో విజయ సంకల్పయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్యాంసుందర్‌గౌడ్, పూస రాజు తదితరులు

ముషీరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మార్చి 1వ తేదీన ముషీరాబాద్ నియోజకవర్గంలో బీజేపీ విజయ సంకల్ప యాత్రను నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూసరాజులు తెలిపారు. గురువారం ముషీరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో పూస రాజు ఆధ్వర్యంలో రూపొందించిన విజయ సంకల్ప యాత్ర వాల్‌పోస్టర్‌ను నియోజకవర్గ కన్వీనర్ రమేష్‌రాం అధ్యక్షతన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్‌గౌడ్ మాట్లాడుతూ ఈనెల 29న రాత్రి ముషీరాబాద్ ఖషిష్ ఫంక్షన్‌హాలులో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, జాతీయ, రాష్ట్ర నాయకులు బసచేస్తారని తెలిపారు. మార్చి1న రాంనగర్ చౌరస్తాలో పదివేల మందితో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహంకాళిజిల్లా ప్రధానకార్యదర్శి సీకే.శంకర్‌రావు, వేముల అశోక్, అధికార ప్రతినిధి రాంరెడ్డి, జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్, రాష్ట్ర నాయకులు జమాల్‌పురి నందు, బిజ్జి కనకేష్‌కుమార్, సదానంద్, జి.వెంకటేష్, ఆర్.విశ్వం, నగర నాయకులు శేష సాయి చంద్రమోహన్ ఆరు డివిజన్‌ల అధ్యక్షులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ భువనగిరి ఎంపీ టికెట్‌ను జాజులకు ఇవ్వాలి

బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ గణేష్‌చారి



మాట్లాడుతున్న బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేషాచారి, బీసీ సంఘాల ప్రతినిధులు

కవాడిగూడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌కు ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా భువనగిరి నుంచి అవకాశం కల్పించాలని రాష్ట్ర వ్యాప్తంగా 136 కులసంఘాలు ఏకగ్రీవంగా తీర్మానం చేశాయని బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారి వెల్లడించారు. గురువారం దోమలగూడ బీసీభవన్‌లో వివిధ సంఘాల నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీల హక్కుల కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు జాజుల శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో చేశారని అన్నారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్‌కు కాంగ్రెస్ అవకాశం ఇస్తే బీసీలంతా ఆనను గెలిపించుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో గంగపుత్ర సంఘం రాష్ట్ర నాయకులు మాదేశి రాజేందర్, మహిళా విభాగం రాష్ట్రఉపాధ్యక్షురాలు ఆనందలక్ష్మి, సగర సంఘం నాయకులు సాయినాథ్ సాగర్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు ఓంకార్, సీహెచ్ ప్రవీణ్, కుల సంఘాల నేతలు పాల్గొన్నారు.

పద్మశ్రీ శిల్పి శ్రీవేలు ఆనందాచారికి సత్కారం



పద్మశ్రీ శిల్పి శ్రీవేలు ఆనందాచారిని గురువారం సత్కరించారు. దేశ వ్యాప్తంగా శిల్పనైపుణ్యంతో అనేక ఆలయాలను ఆనంద చార్యులు నిర్మించారు. ఈ సందర్భంగా ప్రవాస భారతీయ గ్లోబల్ విశ్వకర్మ ఫౌండేషన్ అధ్యక్షుడు రవీంద్రాచారి, సభ్యులు బైరోజు వీరశేఖరాచార్యులు ఆనందాచార్యులను శాలువాతో సత్కరించడంతోపాటు లక్ష రూపాయల చెక్కును సహాయంగా అందజేశారు.

- (బర్కత్‌పుర,ఆంధ్రజ్యోతి)



వంశీ రామరాజును సన్మానిస్తున్న మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు, అందెశ్రీ తదితరులు

వంశీ రామరాజుకు సన్మానం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తెలుగు ఉమెన్ రైటర్స్ ఫౌండేషన్ అక్షరయాన్ ఆధ్వర్యంలో వంశీ సంస్థల అధినేత డా.వంశీ రామరాజును నగరంలోని ఒక హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో సత్కరించారు. ముఖ్యఅతిథిగా మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు హాజరై మాట్లాడుతూ వంశీ సంస్థ పలు తెలుగు గ్రంథాలు ప్రచురించిందన్నారు. అక్షరయాన్ స్థాపకురాలు ఐనంపూడి శ్రీలక్ష్మి మాట్లాడుతూ వంశీ రామరాజు తెలుగు భాషా రచయితల రచనలను వంశీ ప్రచురణల ద్వారా ఎంకరేజ్ చేస్తున్నారన్నారు. ఆయన భాషకు చేస్తున్న సేవకు గుర్తింపుగా ఈ సత్కారం అని తెలిపారు. వంశీ రామరాజుతోపాటు కవి అందెశ్రీ, నేటి నిజం సంపాదకుడు బైస దేవదాసు, రచయిత్రి బండ సరోజని, డా.చెన్నమనేని పద్మజ, రీజనల్ పాస్‌పోర్ట్ అధికారి జొన్నలగడ్డ స్నేహజ పాల్గొన్నారు.

బీజేపీ నేత ఆది నాగేష్ మృతి



ఆది నాగేష్ (ఫైల్)

బర్కత్‌పుర, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బర్కత్‌పుర మాజీ కార్పొరేటర్ ఆదినర్సింగరావు సోదరుడు బీజేపీ నేత ఆది నాగేష్(58) గురువారం మృతిచెందారు. కొంతకాలంగా కాలేయ వ్యాధితో బాధపడుతున్న ఆది నాగేష్ గురువారం తుదిశ్వాస విడిచారు. అతనికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆది నాగేష్ అంత్యక్రియలు అంబర్‌పేట శ్మశాన వాటికలో నిర్వహించారు. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఫోన్‌లో కుటుంబసభ్యులను పరామర్శించారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, ఉపాధ్యక్షులు కన్నె రమేష్‌యాదవ్, ప్రధానకార్యదర్శి సి.కృష్ణాగౌడ్, అధికార ప్రతినిధి ఎడెల్లి అజయ్‌కుమార్, కార్పొరేటర్లు తదితరులు ఆదినాగేష్‌కు నివాళులు అర్పించారు.

ప్రముఖ రంగస్థల కళాకారుడు కె.కృష్ణశాస్త్రి కన్నుమూత



కె.కృష్ణశాస్త్రి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రముఖ రంగస్థల కళాకారుడు కాశీభట్ల కృష్ణశాస్త్రి(77) గురువారం తెల్లవారుఝామున మృతిచెందారు. ఆయనకు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. త్యాగరాయగానసభ పాలకమండలి సంయుక్త కార్యదర్శిగా కూడా పనిచేశారు. ఆయన కొన్ని నాటకాలలో వివిధ పాత్రలను పోషించారు. ఓ ఆంగ్ల దినపత్రికలో ఉన్నప్పుడు ఆయన యూనియన్ నాయకుడిగా పనిచేశారు. కొన్నినెలల క్రితం ఆయన గానసభకు వస్తున్న సమయంలో ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో గాయపడి అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయారు. రెండు రోజుల నుంచి ఆయన ఆరోగ్యం మరింత క్షీణించడం, శ్వాస ఆడక పోవడం అదే సమయంలో గుండెపోటు రావడంతో వెంటనే అతన్ని ముషీరాబాద్‌లోని గురునానక్ కేర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందారు. కృష్ణశాస్త్రి భౌతికకాయానికి బన్సీలాల్‌పేట శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. కేవీ.రమణాచారి, వంశీరామరాజు, కళాజనార్దనమూర్తి, రసమయి రాము, కిన్నెర రఘురామ్, వైఎస్ఆర్ మూర్తి, అభినందన భవాని, నటుడు జంగయ్యగౌడ్ తమ సంతాపం వ్యక్తం చేశారు.

ఐఎన్‌టీయూసీ ఎస్‌డబ్ల్యూ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా హనుమంత్ ముదిరాజ్



హనుమంత్‌ముదిరాజ్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, చంద్రశేఖర్ తదితరులు

రాంనగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీ ఎస్‌డబ్ల్యూ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆర్టీసీ తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి హనుమంత్‌ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆర్‌డీ చంద్రశేఖర్‌లు ఆయనను గురువారం ప్రకటించి, నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు అబ్రహం, గోపాల్, మనోహర్, జకరయ్య, ఉపేన్ తదితరులు పాల్గొన్నారు.

జగ్నే కి రాత్‌కు ఏర్పాట్లు చేయాలి



డీఎంసీ ఖదీర్‌కు వినతి పత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు అఖ్లాక్ హుస్సేన్, మహ్మద్ అలీ

ముషీరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు పవిత్రంగా జరుపుకునే జగ్నే కి రాత్ సందర్భంగా వారికి ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా మసీదులు, శ్మశానవాటికల వద్ద వెంటనే ఏర్పాట్లు చేయాలని ముషీరాబాద్ సర్కిల్ 15 డీఎంసీ ఖదీర్ మొఇనుద్దీన్‌ను కోరారు. ఈ మేరకు ఆయనకు గురువారం బీఆర్ఎస్ నేతలు వినతి పత్రం అందజేశారు. బీఆర్ఎస్ నేతలు అఖ్లాక్ హుస్సేన్, డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ అలీ, ముషీరాబాద్ డివిజన్ మైనార్టీ కమిటి అధ్యక్షుడు పర్వేష్, అడిక్‌మెట్ డివిజన్ సీనియర్ నాయకులు ఖదీర్, నియాజ్‌లు మాట్లాడారు. ఈనెల 25న జరిగే జగ్నే కి రాత్‌ను పురస్కరించుకొని నియోజకవర్గంలోని 40 మసీదులు, 10 శ్మశాన వాటికల వద్ద పారిశుధ్య పనులు, మట్టికుప్పల తొలగింపు, రోడ్ల మరమ్మతు, వీధి దీపాలు, మంచినీటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్‌కు సైతం విజ్ఞప్తి చేశామన్నారు.

ఆలయ హుండీ ఆదాయం రూ.1.46,743



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి ఆలయం నెలరోజులకుగా హుండీ ఆదాయం రూ.1,46,743 వచ్చింది. గురువారం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ, ఆలయ ఈవో దేవనాథం పర్యవేక్షణలో ఆలయ కల్యాణ మండపం ఆవరణలో సిబ్బంది, భక్తులు హుండీ ఆదాయాన్ని లెక్కించారు.

డ్రైనేజీ, పూడిక తీత పనులను పరిశీలించిన కార్పొరేటర్

రాంనగర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని డ్రైనేజీ సమస్య తలెత్తకుండా జలమండలి అధికారులు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి కోరారు. గురువారం డివిజన్‌లోని తిలక్‌నగర్‌చౌరస్తా, బతుకమ్మకుంట ప్రాంతాల్లో ఆమె డ్రైనేజీ పూడిక తీత పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఏబీవీపీ దిష్టిబొమ్మను దహనం చేసిన ఎస్ఎఫ్ఐ

రాంనగర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ కూకట్‌పల్లి క్యాంపస్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులపై ఏబీవీపీ నేతల దాడిని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కు వద్ద ఏబీవీపీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మూర్తి నాగరాజు, నాయకులు అశోక్‌రెడ్డి, రమ్య, స్టాలిన్, ప్రశాంత్, సుశ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులపై కాల్పులను నిరసిస్తూ ఆందోళన

రాంనగర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ సరిహద్దులో రైతులపై పోలీసుల కాల్పులను నిరసిస్తూ పీడీఎస్‌యూ, ఐఎఫ్‌టీయూ, పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో గురువారం రాంనగర్ గుండు చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పి.మహేష్, శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

పండ్ల వ్యాపారిని ఢీకొన్న కారు

తిరుమలగిరి ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పండ్ల వ్యాపారం చేసుకునే ఓ వృద్ధుడిని డాక్టర్ కారుతో ఢీ కొట్టిన సంఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం అల్వాల్ రాజీవ్ వీకర్ సెక్షన్‌కు చెందిన పాషా(60) పండ్ల వ్యాపారి. 14వ తేదీన రాత్రి సమయంలో అల్వాల్ వద్ద రోడ్డు దాటుతుండగా కిమ్స్ హాస్పిటల్‌లో న్యూరాలజీ ఫిజిషయన్‌గా పనిచేస్తున్న చిక్కడపల్లికి చెందిన కార్తిక్ బొల్లారం రైతుబజార్ నుండి తిరుమలగిరి వైపు స్విఫ్ట్ డిజైర్ కారులో వస్తుండగా మెయిన్ రోడ్డు రాగా పాషాను ఢీ కొట్టాడు. దీంతో పాషాకు ఎడమ కాలు విరిగిపోవడంతో పాటు ఛాతీ, తలకు బలమైన గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న పాషా కుమారుడు ఇమ్రాన్ చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో స్థానిక హాస్పిటల్‌కు తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం అత్తాపూర్‌లోని ఓ హాస్పిటల్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా, అక్కడి నుంచి డాక్టర్ పరార్ అయ్యాడు. కార్ఖానా వద్ద వాహనాలను చెకింగ్ చేస్తున్న పోలీసుల ద్వారా అదుపులోకి తీసుకొని కారుని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం పాషా ఆరోగ్యం నిలకడగా ఉందని సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కవాడిగూడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని దోమలగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... లోయర్ ట్యాంక్‌బండ్‌లోని భారత్ పెట్రోల్ బంక్ పక్కన కట్టమైసమ్మ దేవాలయం సమీపంలో సుమారు 50 నుంచి 55 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి ఫుట్‌పాత్‌పై చనిపోయి ఉన్నాడు. స్థానికులు చూసి 100 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు, సంఘటనా స్థలానికి చేరుకున్న దోమలగూడ పోలీసులు ఆ వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.